క్లుప్తంగా

19న మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల: ఈ నెల 19న మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన ఈ సర్వసభ్య సమావేశం జరగనుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

- మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర



నర్సీపట్నం: ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సురేంద్ర కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 50 శాతం వడ్డీ రాయితీని ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిందన్నారు. ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్నుల బకాయిదారులకు ఇది చక్కటి అవకాశమన్నారు. నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన బకాయిలను చెల్లించి రసీదులు పొందాలన్నారు. శానిటేషన్ మెరుగునకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు వీధుల్లో చెత్తను తొలగిస్తున్నట్టు చెప్పారు.

లింగంపేటలో ఉపాధి పనులు ప్రారంభం

గొలుగొండ: లింగంపేట పంచాయతీలో శుక్రవారం ఉపాధి పనులు ప్రారంభించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో గుర్తించిన పనులు జాతీయ ఉపాధి హామీ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కందకాలు, ఫారం పాండ్స్ పనులు నిర్వహించనున్నట్టు ఉపాధి సిబ్బంది రమణ తెలిపారు. గ్రామంలో 390 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయని, వారికి పనులు కల్పించడం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

మారేపల్లి సర్వేయర్ మురళికి ఉత్తమ అవార్డు



మారేపల్లి సర్వేయర్ మురళి

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి సచివాలయంలో గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.మురళి ఉత్తమ సర్వేయర్ అవార్డును అందుకున్నారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకరం జీవీఎంసీ సమావేశ మందిరంలో జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఎస్.గోపాలరాజా, రాష్ట్ర సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.చిరంజీవి, అనకాపల్లి డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ సర్వేయర్ అవార్డును అందుకున్న మురళిని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, మండల సర్వేయర్ జి.గోవిందరాజులు, వీఆర్వోలు అభినందించారు.

హాస్టల్ విద్యార్థిని అదృశ్యం

నర్సీపట్నం: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించడం లేదు. బాలిక ప్రవర్తన విషయమై ఇటీవలే వసతి గృహానికి వచ్చిన ఆమె తల్లి మందలించింది. ఈ నేపథ్యంలో బాలిక వసతిగృహం నుంచి వెళ్లిపోయినట్లు వసతిగృహం నిర్వాహకులు, పోలీసులు అనుమానిస్తున్నారు. బాలిక అదృశ్యంపై వసతిగృహం వార్డెన్ రాజ్యలక్ష్మి సోమవారమే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురు గాలులతో వర్షం

మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ గాలులకు మామిడి కాయలు నేలకొరిగాయి. దీంతో పాటు స్వల్పంగా కురిసిన వర్షానికి ఖరీఫ్ వరి దుక్కులకు రైతులు సిద్ధం అవుతున్నారు.

సంతోషిమాత సత్రానికి ఆర్వో మిషన్ బహూకరణ



అన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైడ్ మిషన్

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయం వద్ద ఉన్న అన్నదాన సత్రానికి దాతలు వాటర్ ప్యూరిఫైడ్ మిషన్‌ను బహూకరించారు. జంక్షన్‌లోని జలమూరి మోహన్‌రావు, వరలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో ఈ మిషన్‌ను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే.!



వర్షానికి చిత్తడిగా మారిన బీఎస్ రోడ్డు



బంగారుమెట్ట జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న బీఎస్ రోడ్డు

బుచ్చెయ్యపేట: చినుకు పడితే చాలు భీమునిపట్నం–నర్సీపట్నం(బీఎస్) రోడ్డు చిత్తడి చిత్తడిగా మారుతోంది. పెద్ద పెద్ద గోతులతో నిండిన బీఎస్ రోడ్డు ఇప్పటికే వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న చిరు జల్లులకు గోతుల్లో వర్షపు నీరు చేరి బురదమయంగా తయారైంది. భారీ వాహనాల రాకపోకల సమయంలో గోతుల్లో నీరు తుళ్లి ద్విచక్ర వాహనదారులపైన, పాదచారులపై పడుతోంది. గోతుల్లో నీరు చేరడంతో రాత్రిపూట ఎక్కడ గొయ్యి ఉందో తెలియక పలువురు వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. విజయరామరాజుపేట, వడ్డాది, ఎల్‌బీ పురం, బంగారుమెట్ట, లోపూడి, శింగవరం తదితర గ్రామాల మీదుగా వెళ్తున్న ఈ రోడ్డులోని గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పేరుకే తారు రోడ్డు అయిన వర్షంతో బురద రోడ్డుగా మారింది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించే విశాఖ, అనకాపల్లి, చోడవరం, పాడేరు ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనదారులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో సంక్రాంతి కల్లా గోతుల్లేని రహదారులుగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్న కూటమి నాయకుల హామీలకు అతీగతీ లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తక్షణం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పూడ్చి, రహదారి అభివృద్ధికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజలపై స్మార్ట్ మీటర్ల భారం వేయొద్దు



బుచ్చెయ్యపేటలో గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చెయ్యపేట: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని జిల్లా సీపీఎం కమిటీ సభ్యుడు వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం బుచ్చెయ్యపేటలో గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. ఎన్నికలు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని, నాణ్యమైన కరెంట్ అందిస్తామని చెప్పి, ఇప్పుడు గద్దె నెక్కిన తరవాత కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోందన్నారు. అదానీలాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూరేలా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ట్రూ ఆఫ్ సర్ చార్జీలు పేరుతో రూ.15 వేల కోట్లు పేద ప్రజలపై భారం వేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రతి ఒక్కరికీ మరో రూ.10 వేలు భారం వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటు సంస్థలకు అప్పగించి ప్రభుత్వం రైతులకు, ప్రజలకు అందిస్తున్న రాయితీలు తీసేయాలని ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాంబశివరావు, నాయుడు, శ్రీను, రాజు, రమణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే పార్టీ పటిష్టత

కె.కోటపాడు : గ్రామ స్థాయి నుంచి బీజేపీ పటిష్టతకు కార్యకర్తలంతా ఐక్యతతో పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు కోరారు. కె.కోటపాడులో శుక్రవారం మాడుగుల నియోజకవర్గ స్థాయి క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పార్టీ నాయకులు ఒక్కరోజు ముందుగానే 13న గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి మేడపురెడ్డి శ్రీనివాస్, ఈర్లె శ్రీరామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షురాలు పైల అమ్మాజి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, శరగడం సన్యాసినాయుడు, కోటాన ఈశ్వరరావు, కూండ్రపు గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'పంతాలకు పోతే సమస్యలు పరిష్కారం కావు'



ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: ప్రతి చిన్న విషయానికి పంతాలకు పోతే ఎలాంటి సమస్య పరిష్కారం కాదని, కుటుంబాలు ఊహించని విధంగా దెబ్బ తింటాయని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం నిర్వహించారు.. ముందుగా ఫిర్యాదులను పరిశీలించి ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ చేశారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం నిబంధనలు అనుసరించి ఇరువురికి న్యాయం చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న దానికి, ఫిర్యాదులో ఉన్నదానికి పొంతన లేకుండా కొన్ని ఉన్నాయన్నారు. గ్రామంలో పెద్దలు సమక్షంలో పరిష్కరించుకునే సమస్యలపై సైతం పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లడం వల్ల ఆర్థికంగా నష్టపోతారన్నారు. అధికంగా భూసరిహద్దు, భూమి తాలుకా సమస్యలు ఉన్నాయన్నారు. ఇరు వర్గాలు అర్థం చేసుకుని రాజీకి వస్తే అందరికీ మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా పదవుల్లో నర్సీపట్నానికి ప్రాధాన్యత



చింతకాయల సన్యాసిపాత్రుడు



రుత్తల యర్రా పాత్రుడు



రుత్తల సత్య నారాయణ



సుర్ల గిరిబాబు



సుర్ల సత్య నారాయణ



కరక అప్పలరాజు



మంకు సాంబమూర్తి



అంకంరెడ్డి రాజు

నర్సీపట్నం: నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులకు జిల్లా స్థాయి కమిటీల్లో పదవులు వరించాయి. గతంలో నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్, సర్పంచ్‌గా పని చేసిన చింతకాయల సన్యాసిపాత్రుడు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మాకవరపాలెం మండలానికి చెందిన రుత్తల యర్రా పాత్రుడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రుత్తల సత్యనారాయణ, సుర్ల గిరిబాబు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నియమితులయ్యారు. సుర్ల సత్యనారాయణ, కరక అప్పలరాజు, మంకు సాంబ మూర్తి జిల్లా యాక్టివిటీ సెక్రటర్లుగా నియమితుల య్యారు. నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడిగా అంకంరెడ్డి రాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎట్టకేలకు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ

చోడవరం: ఎట్టకేలకు నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అన్ని దారులు సుగమమయ్యాయి. మండలంలో పెరుగుతున్న ఓవర్‌లోడ్‌కు అనుగుణంగా అదనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించడంతో గతేడాది చోడవరం మండలానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. అప్పట్లో స్థల సేకరణలో జాప్యం ఏర్పడడంతో ఇప్పటి వరకూ సబ్‌స్టేషన్ నిర్మాణం జరగలేదు. తాజాగా నర్సయ్యపేట వద్ద స్థల సేకరణ చేసి ఏపీఈపీడీసీఎల్‌కు రెవెన్యూ అధికారులు అందజేశారు. దీంతో రూ. 3.5కోట్లతో మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం భూమిని చదును చేసే పనులు ఏడీఈఈ గౌరీశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. త్వరితగతిన సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ప్రకృతి వ్యవసాయ కషాయం తయారు చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు శ్రీదేవి సూచించారు. ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం, మట్టి నమూనాల సేకరణ, పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వంద శాతం ప్రకృతి వ్యవసాయం చేయడానికి మండలానికి ఒక గ్రామం ఎంపిక చేసి పూర్తి స్థాయిలో సాగు పద్ధతులు మారుస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 35 మంది రైతులతో ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అమలు చేస్తున్నామని చెప్పారు. ఏప్రిల్ 15 నుంచి ప్రతి మండలంలో సుమారు వెయ్యి మట్టి నమూనాల సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ రఘునీస్ రుతుపవనాలకు ముందు పొడి నెలల్లో సేద్యం గురించి, నవధాన్యాలు సాగు గురించి వివరించారు. పచ్చిరొట్ట పంటల సాగుతో ఏడాది పొడవునా ఆదాయాన్ని పొందడానికి వీలుంటుందని ఏవో అప్పారావు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కషాయాలు, ఘన జీవామృతం తయారు చేసి చూపించారు.

శిఖర కలశ ప్రతిష్టాపన నేడు



కలశ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహిస్తున్న పురోహితులు

నర్సీపట్నం: బలిఘట్టం ఉత్తరవాహిని ప్రాంతంలో కొలువుదీరిన శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం శిఖర కలశ ప్రతిష్టా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనంతో పాటు ప్రతిష్టా సంకల్పం, క్షేత్రపాలక, రుత్విక్వరుణము, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, యోగిని, నవగ్రహ, సర్వతో మండప స్థాపన, ప్రధాన కలశ స్థాపన, వేదపారాయణం నిర్వహించారు. మూల మంత్ర హోమాలు, జల, క్షీర, ధాన్యపుష్ప, నీరాజన, మంత్రపుష్పాలు తీర్థ ప్రసాద వితరణ చేశారు. శనివారం కలశ ప్రతిష్టా కార్యక్రమం చేస్తామని ఆలయ ప్రధానార్చకుడు రాము తెలిపారు.

వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట రేపు



సీతంపేటలో నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయం

దేవరాపల్లి: సీతంపేటలో వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా శనివారం పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఆదివారం విగ్రహ ప్రతిష్టతో పాటు ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కనుల పండుగగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన, సాయంత్రం తప్పెటగుళ్లు, కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

స్థిరంగా కోనాం జలాశయం నీటి మట్టం



కోనాం జలాశయం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నీటి మట్టం ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్థిరంగా కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరగడంతో విడుదలవుతున్న నీటికి జలాశయంలోకి వస్తున్న నీరు సమానంగా ఉండడంతో నీట మట్టంలో తేడాలు రాలేదు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా.. ప్రస్తుతం 95.40 మీటర్ల వద్ద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 60 క్యూసెక్కులుండగా.. అవుట్ ఫ్లో 60 క్యూసెక్కులుగా నమోదు అవుతుంది.

బడుగుల ఆశాజ్యోతి పూలేకు ఘన నివాళి



కొత్తకోటలో పూలే చిత్ర పటం వద్ద అంజలి ఘటిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు



పెదబొడ్డేపల్లి రోడ్డులో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తూటిపాలలో పూలే వేషధారణలో ఉన్న తరుణ్‌తో ఇతర విద్యార్థులు



దేవరాపల్లిలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ మల్లేశ్వరరావు, తదితరులు

రావికమతం: అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని ఉమ్మడి విశాఖ జిల్లా దళిత బహుజన సంక్షేమ సమాజం కన్వీనర్ మల్లేటి రాజు, ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవ, సంఘ సభ్యులు బుంగా బుల్లిబాబు అన్నారు. మహాత్మ జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను రావికమతం మండలం కొత్తకోట అంబేడ్కర్ కాలనీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యుడు పూడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ..

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జ్యోతీరావు పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి రోడ్డు వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద విగ్రహానికి పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నియోజకవర్గ యూత్ నాయకుడు తమరాన శ్రీను, పార్టీ నాయకులు యాదగిరి శేషు, బేతిరెడ్డి విజయ్, దాడి బుజ్జి, కణితి వాసు, కోఆప్షన్ సభ్యు లు షేక్ రోజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతీరావు పూలే చేసిన సేవలను కొనియాడారు.

తూటిపాలలో..

మాకవరపాలెం: జ్యోతీరావుపూలే జయంతిని తూటిపాల యూపీ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో 4వ తరగతి విద్యార్థి వొబ్బలరెడ్డి తరుణ్ జ్యోతీరావుపూలే వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నాడు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రాము మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లి పాత ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎస్‌ఐ మల్లేశ్వరరావు, సంఘ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు, సంఘం నాయకులు కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు, రొప్పల రాజు, సబ్బవరపు శివ శంకర్, ఉల్లి పరశురామ్, టి.శ్రీరామ్, కన్నాబత్తుల రాజు, పల్లా సంతోష్, కంకడాల సన్నిబాబు, ఎస్.దేముడు, సాల్మన్‌రాజ్, పాల్ రాజు, దేవరాజు పాల్గొన్నారు.

నేడు బాలాంజనేయ స్వామి తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురంలోని శ్రీబాలాంజనేయ స్వామి తీర్థం శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారి తిరువీధి శోభాయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి ఆలయం వద్ద బైటో భజన పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఒక జట్టుకు రూ.200 నామినేషన్ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 70360 18164, 90521 86334, 76618 73880 నంబర్లలో సంప్రదించాలన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

మాడుగుల వాసవీ, వనితా క్లబ్‌లకు నూతన కార్యవర్గాలు



మాడుగులలో వనిత క్లబ్ అధ్యక్షులను సత్కరిస్తున్న సభ్యులు

మాడుగుల రూరల్: మాడుగులలో వాసవీ క్లబ్, వనితా క్లబ్ నూతన కార్యవర్గాలు శుక్రవారం ఏర్పాటయ్యాయి. మాడుగుల వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా కోట్యాడ రమేష్, కార్యదర్శిగా కోట్యాడ దేముళ్లు, కోశాధికారిగా జాగాని కామేష్, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా పుట్టా రాధిక, కార్యదర్శిగా శ్రీనాథు ఉమా, కోశాధికారిగా బత్తుల అరుణ, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. ముఖ్యఅతిథిగా వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు వై.నర్సింగరావు, జిల్లా గవర్నర్ కె.పార్వతి, క్యాబినెట్ కోశాధికారి వి.రత్నావలి, అంతర్జాతీయ ప్రోగ్రాం సమన్వయకర్త శ్రీనాథు శ్రీనివాసరావు, క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు. నూతన పాలకవర్గ సభ్యులతో పాటు అతిథులను ఘనంగా సత్కరించారు.


పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న మేడివాడ సెక్టారు సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి



దేవరాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘన, తదితరులు



సింగన్నదొరపాలెంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో మంగతాయారు, శ్రీనివాస్



కె.జె.పురం 2వ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న మాడుగుల సీడీపీవో శ్రీదేవి

రావికమతం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని మేడివాడ సెక్టార్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి అన్నారు. 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు పురస్కరించుకొని రావికమతం ప్రాజెక్టు, మేడివాడ సెక్టారు పరిధిలో దొండపూడి, మత్స్యవానిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. దొండపూడిలో రాజరాజేశ్వరి మాట్లాడుతూ గర్భం దాల్చిన నుంచి శిశువుకు జన్మనిచ్చే వరకు, ఆ శిశువుకు రెండేళ్ల వయస్సు వచ్చేంత వరకు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. 80 మంది అంగన్‌వాడీ చిన్నారులకు వైస్ సర్పంచ్ జి.రాజారావు, మాజీ వైస్ సర్పంచ్ వి.ఆచారి, పాతాళ చిరంజీవి బూట్లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు దీప, చప్పా లక్ష్మి, జి.రత్నం, జి.వెంకటరమణమ్మ, ఎస్.లక్ష్మి, పి.లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించి, తల్లి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి.. ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం వైద్యాధికారి పూజ్య మేఘన మాట్లాడుతూ సురక్షితమైన మాతృత్వం ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు పునాది అని సూచించారు. గర్భిణి దశలోను, ప్రసవ అనంతరం తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.ఆనంద్, హెచ్‌వీ బి.లక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం 2వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, పోషకాహా రంపై శుక్రవారం మా డుగుల ఐసీడీఎస్ ప్రాజె క్టు అధికారి సిహెచ్. శ్రీదేవి అవగాహన కల్పించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, మహిళా పోలీసు లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు: చిరుధాన్యాలతో కూడిన ఆహారంలో అధికంగా పోషక విలువలు ఉంటాయని కె.కోటపాడు సీడీపీవో మంగతాయారు తెలిపారు. సింగన్నదొరపాలెంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత బారిన పడకుండా ఆకుకూరలతో పాటు పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యమన్నారు. వెలుగు హెచ్‌డీఏపీఎం శ్రీనివాస్, ఏపీఎం చినబాబు, సీసీలు వెంకటరావు పాల్గొన్నారు.